క్లుప్తంగా

కండలేరులో 6.582 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.582 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సులైన బీఅండ్ ఆర్ఎం, ఎంఎల్‌టీ, ఈటీ గ్రూపుల్లో ప్రవేశం పొందవచ్చన్నారు. ఐఎఫ్‌బీ పానల్స్ కలిగిన అధునాతన సౌకర్యాలు, తరగతి గదులతో చక్కటి విద్యాబోధన అందిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తప్పుడు వార్తలు రాస్తే చర్యలు


మాట్లాడుతున్న రేణిగుంట సీఐ మల్లికార్జున

రేణిగుంట: పోలీసుశాఖకు సంబంధించిన అంశాలు, గ్రామాల్లో జరిగే ఘటనలపై తప్పుడు వార్తలు రాసిన వారిపై చర్యలు తీసుకుంటామని రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున హెచ్చరించారు. అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో జరిగే ఘటనలు, ఏవైనా పోలీసు శాఖకు సంబంధించిన ఫిర్యాదులపై వాస్తవాలను తెలుసుకోకుండా కొందరు సత్యదూరమైన అంశాలను వార్తల రూపంలో రాస్తున్నారని, అలాగే వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారని అన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఎస్‌హెచ్‌ఓతో ఒక్కసారి మాట్లాడి పునఃసమీక్షించుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి నేతల అభినందనలు

నాయుడుపేట టౌన్: సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించిన నెలవల విజయశ్రీ ఇంటి వద్ద గురువారం కోలాహలం నెలకొంది. ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ సూళ్లూరుపేట ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యంలను నియోజవర్గ పరిధిలోని ఆ పార్టీ నాయకులు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. నాయుడుపేట మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మైలారి శోభారాణి, టీడీపీ నాయకులు మైలారి రాజశేఖర్ ఎమ్మెల్యే విజయశ్రీకి స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు.

గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



వైద్యసేవలు అందిస్తున్న పింక్ బస్ సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని కొబాక, పాతవీరాపురం గ్రామాల్లో గురువారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయి. కొబాక, పాతవీరాపురం, ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి వచ్చిన రోగులకు మెమోగ్రామ్, అల్ట్రా స్కానింగ్ పేపస్మియర్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మానస, పద్మావతి, సురేష్‌కుమార్, సీహెచ్‌ఓ కృష్ణవేణి, ఏఎన్ఎం కామాక్షి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకాళమ్మ ఆలయం వద్ద గురువారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ప్రతి అమావాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, ఉమేష్‌రావు, క్రాంతికుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేంద్ర రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నపన తిరుమంజనం



కార్వేటినగరం: కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం ఉదయం చక్రస్నానం వేదోక్తంగా జరిగింది. ఉదయం మూలవరులకు చూర్ణాభిషేకం నిర్వహించారు. చక్రస్నానం సందర్భంగా చక్రతాళ్వార్, రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి పల్లకిపై స్వామి వారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

అటకెక్కిన నిఘా వ్యవస్థ

- నాయుడుపేటలో పనిచేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని పోలీసు అధికారులు


నాయుడుపేటలో ఉన్న సీసీ కెమెరాలు


గతంలో పట్టణంలోని పరిస్థితులను తెలుసుకుంటున్న పోలీసు(ఫైల్)

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణం తిరుపతి, నెల్లూరు, చైన్నై, బెంగళూరు తదితర ప్రధాన ప్రాంతాలకు కూడలిగా ఉంది. దీంతో పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. వ్యాపార, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటుండడంతో గ్రామాల నుంచి ప్రజలు నాయుడుపేటలో స్థిర నివాసం ఏర్పరుచుకుంటున్నారు. ఈ క్రమంలో ఎక్కడా ఎలాంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా చూడడంతోపాటు నేరాల నియంత్రణకు నాయుడుపేట పట్టణంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాగా ఉన్న సమయంలో అప్పటి జిల్లా ఎస్పీ సారథ్యంలో నాయుడుపేట పోలీస్ స్టేషన్ నుంచే వీక్షించే విధంగా ప్రతిష్టాత్మకంగా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల యాజమాన్యాలు, పలువురు దాతల సహకారంతో పట్టణంలో పలు ప్రధాన కూడళ్లతోపాటు నరసారెడ్డి కండ్రిగ, మల్లాం జాతీయ రహదారి, గోమతి సెంటర్ తదితర ప్రాంతాలు దాదాపు 45 చోట్లకు పైగా సీసీ కెమెరాలు పెట్టారు. దీంతో పట్టణ పరిధిలో ఏ మూల ఏం జరిగినా వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దేవారు. అప్పట్లో లక్షల వ్యయంతో నాయుడుపేటలో ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ కొంత కాలానికే అటకెక్కింది. సీసీ కెమెరాల మానిటరింగ్ వ్యవస్థకు ఇంటర్‌నెట్ కేబుల్స్ నిర్వహణ ఆర్థిక వ్యయం భారంగా మారింది. కొద్ది నెలలకే సీసీ కెమెరాల పుటేజీ మానిటరింగ్ నిలిచిపోయింది. సీసీ కెమెరాల ఏర్పాటులో చూపిన చొరవ వాటి నిర్వహణపై పోలీసులు శ్రద్ధ చూపకపోవడంతో చాలావరకు కెమెరాలు సైతం మాయమయ్యాయి. అప్పట్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పలు చోరీ కేసులను సునాయసాంగా చేధించారు. అంతే కాకుండా పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద పరిస్థితి తెలిసిపోయేది. ప్రస్తుతం నాయుడుపేట పట్టణంలో కొన్నిచోట్ల తిరుపతి జిల్లా పోలీస్ వ్యవస్థ ఏర్పాటు చేసి ఉన్న సీసీ కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ కెమెరాల పరవేక్షణ జిల్లా కేంద్రం నుంచే చూడాల్సి ఉంటుంది. నాయుడుపేటలో గతంలో మాదిరిగా తిరిగి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగలిగితే శాంతిభద్రతల పర్యవేక్షణతో పాటు చోరీ కేసులను చేధించి నేరాల నియంత్రణకు ఎంతో దోహదపడుతుందని ప్రజలు కోరుతున్నారు.


జిల్లా కేంద్రం నుంచి మానిటరింగ్ చేసే సీసీ కెమెరాలు

పునరుద్ధరణకు చర్యలు చేపడతాం



నాయుడుపేట పట్టణంలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చాలావరకు పనికిరాకుండా పోయాయి. వాటి మరమ్మతుల కోసం గుంటూరుకు పంపించాం. తిరిగి పట్టణంలో ప్రధాన కూడళ్లతో పాటు ముఖ్య ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతల సహకారం తీసుకుంటాం. వాటి నిర్వహణ బాధ్యతలను కూడా దాతలు చేపట్టేలా చర్యలు చేపడుతున్నాం. అదే విధంగా షాపింగ్ మాల్స్ యాజమానులు, అపార్టుమెంట్ వాసులు, బంగారు దుకాణదారులు, ప్రధాన పార్టీల నాయకుల ఇళ్ల వద్ద సైతం స్వచ్ఛందంగా జనాల రాకపోకలు క్లుప్తంగా కనిపించే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచనలు చేశాం.

–శ్రీనివాసరెడ్డి, అర్బన్ సీఐ, నాయుడుపేట

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

వెంకటగిరి రూరల్: నేషనల్ మిన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు నిర్వహించిన పరీక్షలో ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ తుల సిజ్యోతి తెలిపారు. 8వ తరగతి చదివే విద్యార్థులు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు చేస్తుందన్నారు. తమ పాఠశాలకు చెందిన సజ్జ వెంకటనాగసాయి, సునంద, గుడతొట్టి రక్షిత, తిరుపతి మునిజస్మిత, పెట్లూరు దీపిక, కొంపల ముని, పూజిత, వెన్నెల, గౌతమ్ ర్యాంకులు సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్టు తెలిపారు.

టీబీ సోకకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలి


బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

రాపూరు: 18 నుంచి 60 ఏళ్లలోపు వారు టీబీ సోకకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలని వేపినాపి పీహెచ్‌సీ వైద్యుడు సూర్యధర్మేంద్ర తెలిపారు. మండలంలోని శానాయిపాళెం హెల్త్ సెంటర్‌లో గురువారం బీసీజీ వ్యాక్సిన్ వేశారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ టీకాను వేస్తున్నట్లు చెప్పారు. టీబీ నిర్మూలనకు మందుల వాడి తగ్గిన వారికి, ధూమపానం, పొగాకు అలవాటు ఉన్నవారికి టీకా కచ్చితంగా వేసుకోవాలని సూచించారు.

పైపులైన్‌కు మరమ్మతులు


పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని తిలక్ నగర్ ప్రాంతంలో దెబ్బతిన్న పైపులైన్‌కు అధికారులు గురువారం మరమ్మతులు చేపట్టారు. తిలక్ నగర్ ప్రాంతంలో ఉన్న బోరు నుంచి అడివయ్య కాలనీ, తిలక్ నగర్, నెల్ క్యాస్ట్, టిడ్కో ఇళ్లలోని 1,500 కుటుంబాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. మూడు రోజుల క్రితం పైపులైన్ పగిలిపోవడంతో తాగునీరు అందలేదు. స్థానికుల ఇబ్బందులపై తాగు నీటికి కటకట అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపాలిటీ అధికారులు యంత్రాల సాయంతో పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు.

గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి పోలైన ఓట్లు


గ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు (ఫైల్)

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొంత మెజారిటీ ఓట్లు దక్కాయి. మండలంలో 11,609 ఓట్లు లభించాయి. టీడీపీకి 13,440 ఓట్లు వచ్చాయి. రూరల్ పరిధిలో టీడీపీకి 1,831 ఓట్లు మెజారిటీ లభించింది. మర్లపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 289 ఓట్లు రాగా టీడీపీ 247 ఓట్లు వచ్చాయి, పుదూరులో మూడు పోలింగ్ బూతుల్లో వైఎస్సార్ సీపీకి 1,216 ఓట్లు, టీడీపీ 1096 ఓట్లు పడ్డాయి. బిరదవాడలో వైఎస్సార్ సీపీకి 518 ఓట్లు, టీడీపీకి 441 ఓట్లు, పూడేరులో వైఎస్సార్ సీపీకి 560 ఓట్లు, టీడీపీకి 456 ఓట్లు దక్కాయి. కారుమంచివారి కండ్రిగలో వైఎస్సార్ సీపీకి 299 ఓట్లు, టీడీపీకి 149 ఓట్లు వచ్చాయి. పండ్లూరులో వైఎస్సార్ సీపీకి 454 ఓట్లు, టీడీపీకి 441 ఓట్లు వచ్చాయి. చిలమాత్తురులో వైఎస్సార్ సీపీకి 477 ఓట్లు, టీడీపీకి 238 ఓట్లు వచ్చాయి. కాపులూరులో వైఎస్సార్ సీపీకి 407 ఓట్లు, టీడీపీకి 393 ఓట్లు దక్కాయి. కూచివాడపాళెంలో వైఎస్సార్ సీపీకి 191 ఓట్లు, టీడీపీకి 164 ఓట్లు వచ్చాయి. కల్లిపేడులో వైఎస్సార్ సీపీకి 247 ఓట్లు, టీడీపీకి 212 ఓట్లు దక్కాయి. అయ్యప్పరెడ్డిపాళెంలో వైఎస్సార్ సీపీకి 330 ఓట్లు, టీడీపీకి 271 ఓట్లు వచ్చాయి.

అదేవిధంగా పలు గ్రామాల్లో టీడీపీకి మెజారిటీ ఓట్లు లభించాయి. విన్నమాలలో మూడు పోలింగ్ బూతలలో వైఎస్సార్ సీపీకి 937 ఓట్లు, టీడీపీకి 992 ఓట్లు వచ్చాయి, తుమ్మూరులో నాలుగు పోలింగ్ బూతలలో వైఎస్సార్ సీపీకి 1135 ఓట్లు, టీడీపీకి 1517 ఓట్లు దక్కాయి. అన్నమేడులో మూడు పోలింగ్ బూతలలో వైఎస్సార్ సీపీకి 461, టీడీపీకి 777 ఓట్లు వచ్చాయి. వేముగుంటపాళెంలో వైఎస్సార్ సీపీకి 284 ఓట్లు, టీడీపీకి 303 ఓట్లు, తన్నమాలలో వైఎస్సార్ సీపీకి 113 ఓట్లు, టీడీపీకి 172 ఓట్లు వచ్చాయి. మడపలంలో వైఎస్సార్‌సీపీకి 191 ఓట్లు, టీడీపీకి 205 ఓట్లు వచ్చాయి. గొట్టిప్రోలులో వైఎస్సార్ సీపీకి 448 ఓట్లు, టీడీపీకి 718 ఓట్లు వచ్చాయి. జువ్వలపాళెంలో వైఎస్సార్ సీపీకి 359 ఓట్లు, టీడీపీకి 429 ఓట్లు దక్కాయి. అరవపెరిమిడిలో వైఎస్సార్‌సీపీకి 256 ఓట్లు, టీడీపీకి 356 ఓట్లు వచ్చాయి. మేనకూరులోని నాలుగు పోలింగ్ బూతలలో వైఎస్సార్ సీపీకి 1104 ఓట్లు, టీడీపీకి 1648 ఓట్లు దక్కాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వగ్రామమైన భీమవరంలో వైఎస్సార్ సీపీకి 349 ఓట్లు, టీడీపీకి 502 ఓట్లు వచ్చాయి. చిగురుపాడులో వైఎస్సార్ సీపీకి 193 ఓట్లు, టీడీపీకి 419 ఓట్లు దక్కాయి. తిమ్మాజికండ్రిగలో వైఎస్సార్ సీపీకి 113 ఓట్లు, టీడీపీకి 289 ఓట్లు వచ్చాయి. కూచివాడలో వైఎస్సార్ సీపీకి 110 ఓట్లు, టీడీపీకి 155 ఓట్లు దక్కాయి. ద్వారకపురంలో వైఎస్సార్ సీపీకి 224 ఓట్లు, టీడీపీకి 348 ఓట్లు పడ్డాయి. నాయుడుపేట అర్బన్‌లో వైఎస్సార్ సీపీకి 7,011 ఓట్లు, టీడీపీకి 13,604 ఓట్లు వచ్చాయి.

యువత క్రీడల వైపు మొగ్గు చూపాలి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న శేషురెడ్డి

చిట్టమూరు (చిల్లకూరు): యువత క్రీడల వైపు మొగ్గు చూపి ఉన్నత స్థాయికి చేరుకోవాలని చిట్టమూరు మండల వైఎస్సార్ సీపీ నాయకుడు దువ్వూరు శేషురెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కొక్కుపాళెంలో గురువారం దువ్వూరు హనుమంతరామిరెడ్డి జ్ఞాపకార్థం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభచూపి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. దువ్వూరు హనుమంతరామిరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల్లో ఐదు జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. అనంతరం ఆయన బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు.

అనీమియా వ్యాధిపై అవగాహన


అనీమియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు పంచాయతీ ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీలో గురువారం వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు సికిల్ సిల్ అనీమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికిల్ సిల్ అనీమియా జీవిత కాల వ్యాధి అని, రక్తంలో ఎర్ర రక్త కణాలలో వృత్తాకార బిళ్లల రూపంలో ఉంటాయన్నారు. ఈ వ్యాధితో రక్త ప్రసరం తగ్గుతుందని, దీంతో స్ట్రోక్, కంటి సమస్యలు, ఆర్గానిక్స్ దెబ్బతింటాయని తెలిపారు. గిరిజన కాలనీలో ఈ వ్యాధి అధికంగా ఉండడంతో వారికి పరీక్షలు చేసి, వ్యాధి ఉన్న వారిని గుర్తిస్తామని చెప్పారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం


రాపూరు గ్రంథాలయంలో చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ధనమ్మ

రాపూరు: స్థానిక గ్రంథాలయంలో కొంతకాలంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసినట్లు గ్రంథాలయ అధికారిణి ధనమ్మ తెలిపారు. విద్యార్థులకు గురువారం ఆటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతుల వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి, సృజనాత్మక విలువలను పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జీవన జాగృతి మిత్రమండలి అధ్యక్షుడు సురేష్, నెహ్రూ యువ కేంద్రం సిబ్బంది శివకుమార్, పరుశురామ్, గ్రంథాలయ సహాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెంకటగిరి అభివృద్ధికి కృషి

- ప్రతిపక్ష నేతల సూచనలను స్వీకరిస్తా
- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ


మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి రూరల్: వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన గురువారం వెంకటగిరిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని, తర్వాత అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాలన్నారు. ఇందులో భాగంగా వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు. ప్రతిపక్ష నేతలు ఇచ్చే సూచనలు సలహాలు న్యాయబద్ధంగా ఉంటే పాటించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పులుకొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, రామచంద్రయ్య, సింగంశెట్టి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింకకు తీవ్రగాయాలు


జింకకు వైద్యం చేస్తున్న గోపాలమిత్ర ప్రతాప్

తొట్టంబేడు : కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణరక్షణ కోసం ఓ జింక తెలుగుగంగ కాలువలోకి దూకిన ఘటన మండలంలోని పిల్లమేడు సమీపంలో గురువారం జరిగింది. తెలుగుగంగ కాలువలో ఓ జింక ఉన్నట్లు స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. డీఆర్‌ఓ రామకృష్ణ, గార్డ్ దామోదరం, డ్రైవర్ కార్తీక్, చెక్‌పోస్టు సిబ్బంది వెంకటేష్ పిల్లమేడు చేరుకుని తెలుగుగంగ కాలువ నుంచి జింకను వెలికితీసి చూడగా ఆ జింక కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడినట్లు గుర్తించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న గోపాలమిత్ర ప్రతాప్‌ను సంప్రదించి జింకకు వైద్యం చేయించారు. జింక పరిస్థితి కాస్త ఆందోళనకరంగా ఉన్నట్లు డీఆర్‌ఓ రామకృష్ణ తెలిపారు. జింకను వైద్యుల పర్యవేక్షణలో మరికొన్ని రోజులు వైద్యం అందించి, ఆరోగ్యం కుదుటపడితే అడవిలో వదిలి పెడతామని డీఆర్‌ఓ చెప్పారు.

ఒక వైపు ఎండ తీవ్రత ... మరో వైపు వర్షం


వర్షం కురుస్తున్న దృశ్యం

చిల్లకూరు: నైరుతీ రుతుపవనాలు ప్రారంభం కావడంతో వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం నుంచి మబ్బులు కమ్ముకుని మోస్తరు వర్షం కురుస్తుండడంతో ప్రజలు సేద తీరుతున్నారు. గూడూరు, చిల్లకూరు, ప్రాంతాల్లో నాలుగు రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉంది. పట్టణ, మండల ప్రజలు వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పనులు చక్కబెట్టుకుంటున్నారు.

డక్కిలిలో భారీ వర్షం


డక్కిలిలో జోరున కురుస్తున్న వర్షం

డక్కిలి: మండలంలో రెండు రోజులుగా జోరుగా వర్షం కురుస్తోంది. మూడు నెలల నుంచి ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడారు. నీటి కొరతతో నిమ్మ తోటలు ఎండుముఖం పట్టాయి. ఏరులు, వాగుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. సాగునీరు తక్కువ కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో నైరుతి రుతుపవనాల ప్రభావంలో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. నిమ్మ, వేరుశనగ పంటలకు వర్షం ఊరట కలిగింది.

ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ


ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం అందజేస్తున్న సంస్థ ప్రతినిదులు

గూడూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో గురువారం ప్రగతి సేవా సంస్థ పర్యవేక్షణలో ఎయిడ్స్ బాధితులకు డాక్టర్ సీఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని పథకం కింద పౌష్టికాహారం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్యుడు సీఆర్ రెడ్డి పేరుతో వారి కుటుంబ సభ్యులు ఎయిడ్స్ బాధితులు 30 మందికి ప్రతి నెలా పౌష్టికాహారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్ధనరెడ్డి సంపూర్ణ సహాయ సహకారాలతో ఎయిడ్స్ బాధితుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్, కాటూరు శ్రీనివాసులు, వాకాటి రామోహన్‌రావు, శ్రీ చైతన్య ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వాచ్‌షాపు రాము, కుమార్‌నాయుడు, సురేష్‌రెడ్డి, కోట వెంకటేశ్వర్లు, శ్రీహరి, నాగరాజు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.